# సంపాదకీయం



**నాస్తి మాతృ నమో గురుః**

**నాస్తి మాతృ నమః పూజ్యో**

**నాస్తి మాతృ నమః సఖా**

**భావం:** తల్లితో సమానమైన గురువు లేరు, తల్లితో సమానమైన పూజ్యులు లేరు, మిత్రులు లేరు.

నిజమే! తల్లిప్రేమ ఎన్నటికి తరగనిది. "అమ్మ" అనేమాటలో దాగియున్న అనుభూతి, ఆనందం, అనురాగం, అంతా ఇంతాకాదు. మనసున్న మనిషేకాదు, మాటలు రాని మూగజీవులు కూడా అమ్మను తలపింపజేస్తాయి.

ఎందరో మహానుభావులు, కొందరికే వందనాలు. ఆ కొందరిలో మరియతల్లి ప్రధమురాలు అని చెప్పాలి. ఎందుకంటే అందరిలా ఆమె ఒక సామాన్య స్త్రీ అయినా, ఆమె జన్మ ఒక ప్రత్యేకం. దైవ ప్రణాళికలో మానవ రక్షణ నిమిత్తం అపురూపంగా, పవిత్రంగా రూపొందించబడింది. పుట్టడం గొప్పకాదు. ఆ జీవితం ద్వారా ఇతరులను జీవింపజేయడం మహోన్నతం. తన కళ్ళముందే తన కుమారుడను అవహేళన చేస్తూ ఉంటే, యూదులరాజు, దావీదు కుమారుడా! జయము! అన్నవారు సిలువ వేయండి అని కేకలు పెడుతూ ఉంటే, ఘోరమైన సిలువ మరణాన్ని పొందుతూ ఉంటే బాధను మనసులో దిగమింగుకొని లోకరక్షణ కొరకు మౌనంగా భరించింది. తన కుమారుని మరణం ద్వారా పాపంలో పడిపోయిన మానవాళి జీవం పోసుకుంటుందని, దేవుని మహిమలో భాగస్తులవుతారని ఆనందించింది. ఆమె త్యాగం, సహకారం వర్ణించలేనటువంటివి.

అందుకే శ్రీసభ మరియతల్లి యొక్క ఔన్నత్యాన్ని గౌరవిస్తూ దైవార్చనలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఇచ్చింది. సహరక్షకి అయిన ఆమె జీవితంలో కొన్ని

ఘట్టాలను స్మరిస్తుంది. అందులో ఒకటి ఆమె జననం. (సెప్టెంబరు 8). జన్మదినాన బహుమతులు ఇవ్వడం ఆనవాయితి. ఇది బాంధవ్యాలను స్థిరపరుస్తుంది. మరి మన ఆధ్యాత్మిక తల్లియైన మరియతల్లికి ఏ బహుమానం ఇవ్వాలి. ఆ తల్లిని ఏవిధంగా సంతోష పెట్టగలం! ఆమెతో మన బాంధవ్యాన్ని ఎలా స్థిరపరచుకోగలం? గౌరవ ప్రధంగా జపమాలను వల్లిస్తూ, తనకుమారుడైన క్రీస్తు అగుడుజాడల్లో నడవడమే మనం ఇచ్చే బహుమానం. ఇదే ఆ తల్లిని సంతోషపెట్టె బహుమానం అని నేను అంటాను.

"అమ్మ ఉన్నచోట అన్ని ఉన్నట్లే" అని అమెరికా అధ్యక్షులలో ఒకరైన అబ్రహాం లింకన్ అన్నారు. అవును. ఆ తల్లి ఉన్నచోట మన రక్షకుడైన క్రీస్తు ఉన్నాడు. క్రీస్తు ఉన్నచోట ప్రేమ, క్షమాపణ ఉన్నాయి. ప్రేమ, క్షమాపణ ఉన్నచోట ఆయనలో మనకు స్థానం ఉంది. అదే పరలోకం. ఆ పరలోకానికి మనందరిని చేయిపట్టుకొని నడిపించే తల్లే, మరియతల్లి.

అనురాగ పల్లకి, ఆనంద మల్లిక, మరియతల్లికి జన్మదిన శుభాకాంక్షలు.

**ఫా. దామాల విజయ కుమార్**

**ఎడిటర్**

# సామాన్య 22వ ఆదివారం
# 03-09- 2017

**యిర్మీయా 20:7-9 రోమీ 12:1-2 మత్తయి 16:21-27**

ప్రతికూల పరిస్థితులలో కూడా దైవాదేశాన్నే తలదాల్చిన భక్తులు, ప్రవక్తలు. యిర్మీయా తదితర ప్రవక్తలందరు ప్రజలు తమనెంతగా బాధించి హింసించినా దేవుని మాటకే కట్టుబడి జీవించారు. అదే సంప్రదాయం ప్రకారం యేసు ప్రభువు సైతం తన తండ్రి సంకల్పానికే ప్రాధాన్యమిచ్చారు, ఆయన ఆదేశాలను తూ.చా. తప్పక పాటించారు. తన శిష్యులమైన మనం కూడా తండ్రి దేవుని మాటకూ, తాను చూపిన బ్రతుకు బాటకూ కట్టుబడి పుణ్యజీవనం గడపాలని యేసుప్రభువు కోరుతున్నారు. అలా దేవునికి సదా విశ్వాసపాత్రులముగా జీవించే శక్తిని "దివ్యసత్ప్రసాదం" ద్వారా మనకాయన ప్రసాదిస్తున్నారు.

## మొదటి పఠనం: యిర్మీయా 20:7-9

క్రీస్తు పూర్వం 627 ప్రాంతంలో దేవుడు యిర్మీయాను పిలచి తన ప్రవక్తగా నియమించారు. అప్పటికి యిర్మీయాకు 23 యేళ్ళు. పాత ఇస్రాయేలీ జాతిని ధ్వంసం చేసి దైవప్రజల నవీన జాతిని నిర్మించుమని దేవుడు యిర్మీయాను ఆదేశించారు. అయితే నవజాతి నిర్మాణం గురించి ప్రయత్నించిన ప్రతిసారీ యిర్మీయా- ఇస్రాయేలీ వినాశం గురించీ, విధ్వంసం గురించీ, రాబోయే శిక్ష గురించి, ప్రవచించవలసి వచ్చేది. ఇలా జాతి వినాశం గురించి ప్రవచించినందుకుగాను యెరూషలేము దేవాలయ ప్రధానాధికారి పషూరు యిర్మీయాను కొరడాలతో కొట్టించి ఓ రోజంతా బందిఖానాలో వేయించాడు.

నిజానికి ఇలా పదేపదే స్వజాతి ప్రజల వినాశం గురించి ప్రవచించడం యిర్మీయాను సైతం ఎంతగానో కుంగదీసేది. ఎందుకంటే తన జాతి జనులంటే యిర్మీయాకు ప్రాణం. వారిపట్ల తనకెంతటి ప్రేమాభిమానాలున్నప్పటికీ,

సర్వశక్తిమంతుడైన దేవుని ఆదేశాన్ని ధిక్కరించే సాహసం చేయలేక వినాశ విధ్వంసాల గురించి ప్రవచించక తప్పేది కాదు. ఇంతటి ఆంతరంగిక సంఘర్షణను తట్టుకుంటూ దైవాదేశం ప్రకారం ప్రవచించినప్పటికీ తాను పలికిన ప్రవచనాలు చప్పున నెరవేరేవికాదు. అది చూచి ప్రజలతణ్ణి హేళన చేసేవారు, దేశద్రోహిగా జాతివిద్రోహిగా చిత్రించేవారు. ఈ పరిణామాలు యిర్మియాను మరింత కలవరపరచేవి. దేవుడు తనను నమ్మించి నట్టేట ముంచాడని మధనపడేవాడు. తాను పలకనున్న ప్రవచనాలు పలికినా, తాను పలికిన తక్షణమే దేవుడు ప్రజలను శిక్షించకపోవడంతో ప్రవక్తగా యిర్మియా పరాభావాల పాలు కావలసి వచ్చేది. అటు దేవుని మాటను కాదనడానికీ అశక్తుడై, ఇటు తాను పలికిన మాటను నిలబెట్టుకోలేని అసమర్థుడై యిర్మియా ప్రవక్త ప్రజలదృష్టిలో రెండికి చెడ్డ రేవడిలా నిలువవలసి వచ్చేది.

ఈ నేపథ్యంలో యిర్మియా తన మనోవేధనను తీవ్రనైరాశ్యాన్నీ ముప్పిరిగొనే విషాదాన్ని ప్రార్థనా రూపంలో తిరిగి దేవునికే విన్నవించుకొనేవాడు. “ప్రభూ! నీవు నన్ను చెరిచితివి, నేను చెడితిని” అంటూ తన అక్కసునంతా దేవుని ముందు వెళ్ళగక్కేవాడు.

ఈనాటి మొదటి పఠనంలో వేదనాభరితమైన యిర్మియా ప్రార్థననే మనం చదువుతున్నాం. ఈ పఠనం దేవుని వాక్కునకు గల అమోఘమైన శక్తిని మనకు వెల్లడించటమేగాక, మనలోని మనోవేదనను పరితాపాన్నీ కూడా ప్రార్థనలుగా ఎలా మలచుకోవాలో బోధిస్తుంది.

## రెండవ పఠనం: రోమీ 12:1-2

ఈ పఠనం “కాబట్టి” అనే మాటతో ఆరంభమవుతుంది. “కాబట్టి సోదరులారా!... మిమ్ము బతిమాలుకొనుచున్నాను”. ఒకవేళ తెలుగు బైబులు గ్రంథంలోగానీ, దివ్యపూజా పఠనాల గ్రంథంలో గానీ ఈ భాగం “కాబట్టి అనే మాటతో ఆరంభం కాకపోతే, ఈ మాటను చేర్చి చదవడంలో తప్పులేదు. గ్రీకు మూలంలో ఈ పదం ఉంది. గనుక ఈ పదాన్ని (కాబట్టి) చేర్చినపుడే ఈ పఠనం మూలవిధేయంమవుతుంది, అర్థవంతమవుతుంది.

ఈనాటి పఠనంలో "కాబట్టి" అనే పదం అత్యంత కీలకమైనది. నిజానికి క్రైస్తవ నీతి శాస్త్రాన్ని "కాబట్టి శాస్త్రం" అని కూడా పిలుస్తారు. ఎందుకంటే దేవుడు క్రీస్తు ప్రభువు ద్వారా మనకెన్నో మేలులు చేశారు కాబట్టి, నేటికీ ఎన్నో మేలులు చేస్తున్నారు కాబట్టి అందుకు ప్రతిస్పందనగానే మనం నైతిక జీవనం గడపడానికి బద్ధులమై ఉన్నాం. దేవుడు మనకు ఏదో మహోపకారం చేశారు కాబట్టే మనమిప్పుడు "క్రైస్తవ నైతిక నియమాల" గురించి మాట్లాడుకోగలుగుతున్నాం.

క్రైస్తవ నీతిశాస్త్రమంటే కేవలం చట్టాలు, కట్టడలు మాత్రమే కావు. ఈ చట్టాలన్నీ దేవుడు చేసిన ఉపకారాలకు గాను మన మనస్సులు చేసే ప్రతిస్పందనలు మాత్రమే. అయితే ఇక్కడ స్పందించే మన మనస్సులు కేవలం భౌతికమైనవీ లౌకికమైననీ కావు, అవి జ్ఞానస్నానం ద్వారా నూత్నీకరింపబడిన మనస్సులు. యేసుక్రీస్తు ద్వారా అనునిత్యము కొత్తదనాన్ని, లావణ్యాన్ని సంతరించుకుంటున్న మనస్సులు. ఇలా నూత్నీకరింపబడుతోన్న మనస్సులతో స్పందిస్తూ మనం పాటించే నైతిక నియమాలు దేవునికి మనం చేసే "యథార్థమైన ఆరాధన" లవుతాయి, పరిమళభరితమైన బల్యర్పణలయ్యేవరకు దేవుడు తన అనంత దయాకనికరములతో మన తప్పులను మన్నిస్తూ ఉంటారు, మన లోటుపాటులను బర్తీచేస్తూ ఉంటారు.

## సువార్త పఠనం: మత్తయి 16:21-27

ఈనాటి సువార్త పఠనాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, ఇంతకు ముందు జరిగిన సంఘటనకు కూడా ఓసారి గుర్తుచేసుకోవాలి. ఆ సంఘటనలో పేతురు ప్రభువుపట్ల తనకు విశ్వాసాన్ని ప్రకటిస్తూ "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అంటాడు. ఈ మాటలకు ప్రసన్నుడైన ప్రభువు సీమోనుకు "పేతురు" అని నామకణం చేస్తారు.

ఇక ఈనాటి పఠనంలో మొదటిబాగంలో యేసు తాను అనుభవించబోయే శ్రమల గురించీ, మరణం గురించీ, పునరుత్థానం గురించీ ప్రస్తావిస్తున్నారు. ఈ

మాటలు విన్న పేతురు అభ్యంతరం చెబుతాడు. ఆ విధంగా మాట్లాడరాదనీ అశుభం పలకవద్దనీ యేసును "వారిచే" వరకు వెళ్తాడు. సువార్త గ్రంథాలన్నింటిలోను యేసు ప్రభువు ఒక శిష్యుడిచేత "వారింపబడిన" సంఘటన ఇదొక్కటే.

పేతురు తండ్రిదేవుని అనుగ్రహం పొందిననవాడు. దేవుడు ఎరుకపరచిన నిగూఢ సత్యాలను గ్రహించి ప్రకటించే అరుదైన భాగ్యాన్ని పొందినవాడు. అయినప్పటికీ, తాను ప్రకటించిన సత్యాన్ని తానే విశ్వసించడానికి పేతురుకున్న శక్తి చాలలేదు. యేసు ప్రభువే మెస్సయా అని తెలిసినప్పటికీ, యేసు ఏ తరహా మెస్సయా ప్రభువో, పేతురు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాడు. అంటే యేసు ఏ తరహా మెస్సయాగా ఉండాలని తండ్రి దేవుడు కోరుతున్నారో తెలుసుకోలేకపోయాడు. గనుకనే పేతురు త్వరపడి యేసును "వారించడానికి" సాహసించాడు.

ఇలా పేతురు, ప్రభువును వారిస్తూ ఉచిత సలహా ఇవ్వడం ద్వారా "ఎడారి శోధన" ఘట్టంలో సైతాను ప్రవర్తించినట్లు ప్రవర్తించి ప్రభు ఆగ్రహానికి గురయ్యాడు. అక్కడ సైతాను కూడా సిలువపై ఆత్మబలిదానం కావించకుండానే తనకున్న దివ్యశక్తులతో మెస్సయా ప్రభువుగా నిరూపించుకొమ్మని ప్రభువుని శోధించాడు. ఇక్కడ అదేరీతిగా ప్రవర్తించాడు. గనుకనే పేతురును యేసుప్రభువు "ఓ సైతాను, నా ఎదుటి నుండి పొమ్ము" తీవ్రంగా ఖండించవలసి వచ్చింది. ఎందుకంటే సైతాను మాటలను చేతలను గుర్తుకు తెచ్చి పేతురు యేసుప్రభువు కొక శోధనలాగా అడ్డుపడబోయాడు. అందుకు ప్రభువు పేతురును తన వెనుకకు పొమ్మని అదేశించారు. అంతేకాదు తన ముందు నిలచి తనను నడిపించే హక్కు పేతురుకు లేదని కూడా ప్రభువు స్పష్టంచేస్తున్నారు. ఒక శిష్యుడుగా పేతురు ఎప్పుడూ తనను అనుసరించవలసిన వాడేనని కూడా ప్రభువిక్కడ చెప్పకనే చెబుతున్నారు.

ఈ సంఘటనలో పేతురు కొంత "అతి" గా ప్రవర్తించినప్పటికీ, యేసుప్రభు యదార్థ స్వరూప స్వభావాలను తెలుసుకొనే మహత్తరమైన అవకాశం ఆయనకు లభించింది.

ఇకపోతే పఠనంలోని రెండవభాగంలో యేసుప్రభువు తనను అనుసరించగోరేవారు ఏం చేయాలో చెబుతున్నారు. క్రైస్తవ శిష్యరికమంటే ఏమిటో నిర్వచిస్తున్నారు. శిష్యులు తమ గురువును యేసు ప్రభువును త్రికరణశుద్ధిగా అనుకరించాలి. ఆయన ప్రబోధాలను అనుసరించడం మాత్రమే చాలదు, ఆదర్శప్రాయమైన ఆయన జీవన విధానాన్ని అనుకరించాలి. నూటికి నూరుపాళ్ళు ప్రభువులా జీవించాలి. యేసు ప్రభువుకు ఎలాంటి కష్టనష్టాలు ఎదురయ్యాయో, అలాంటి విషమ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభు శిష్యులు సైతం సిద్ధంగా ఉండాలి. ఈ సత్యాన్ని పేతురు పసిగట్టగలిగాడు. గనుకనే శ్రమల గురించీ సిలువ మరణం గురించీ మాట్లడవద్దని ప్రభువునే వారించడానికి సాహసించాడు. ఈ రెండవ భాగంలో ప్రధానాంశమేమిటంటే తన శిష్యులు "తన నిమిత్తం" తమ ప్రాణములను ధారవోయుటకు సిద్ధంగా ఉండాలని యేసు ప్రభువు కోరుతున్నారు.

అయితే ఇక్కడ మనం గమనించవలసిన చిన్న తేడా ఒకటి ఉంది. అదేమిటంటే ఒక సైనికుడు తన దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడి ఉండడం వేరు, ప్రభుశిష్యుడు యేసు ప్రభువుకోసం ఆత్మబలిదానం చేయడానికి సంసిద్ధుడుగా జీవించడం వేరు. అవును. ప్రభువుకోసం ప్రాణత్యాగం చేయడానికి అనుక్షణం సిద్ధంగా ఉండేవారు ప్రభుశిష్యులు!

ఎట్టకేలకు పేతురు తాను యేసు ప్రభువును ఏవిధంగా అనుసరించాలో తెలుసుకోగలిగాడు. "నీవు వృద్ధుడవైనపుడు నీ చేతులు చాచెదవు. అపుడు వేరొకరు నిన్ను కట్టివేసి నీవు వెళ్ళుటకు ఇష్టపడని చోటుకు తీసికొని పోవును". (యోహాను 21:18) ఇదే దేవుని మహిమార్థం యేసు ప్రథమ శిష్యుడైన పేతురు అనుభవించనున్న మరణాన్ని సూచిస్తుంది.

ఈనాటి మొదటి పఠనం మాదిరి సువార్త పఠనం కూడా నమ్మక పాత్రులైన ప్రభుశిష్యులు ఏవిధంగా జీవించాలో, అనుక్షణం ఎంత అప్రమత్తులై ఉండాలో, ఎదురయ్యే పర్యవసానాలకు ఏవిధంగా సిద్ధపడి ఉండాలో స్పష్టం చేస్తుంది.

**ముగింపు:**

కోరి ఎవరు కష్టాలు కొనితెచ్చుకోరు. నిలువెత్తు బంగారమిస్తామన్నా బాధలు పడడానికి ఎవరూ ముందుకు రారు. మంచికోసం ఏ కొంచెం బాధపడాల్సి వచ్చినా తప్పించుకుపోజూసే వాళ్ళే కనబడతారు గానీ త్యాగాలకు సిద్ధపడేవాళ్ళు అరుదు.

అయితే దేవుడు ఎవరినైనా ప్రత్యేకమైన పనికి ఎన్నుకున్నపుడు, అతడు చేయవలసిన పనిలో అనుభవించవలసిన బాధ కూడా ఒక భాగమై ఉంటుంది. ఉదాహరణకు యిర్మియా తనకు దేవుడిచ్చిన సందేశాన్ని ధైర్యంగా బోధించడం వలన అనేక హింసలననుభవించవలసి వచ్చింది.

అలాగే యేసుప్రభువు తండ్రి దేవుని ప్రణాళిక ప్రకారం తాను అనేక బాధలననుభవించక తప్పదని చెప్పినపుడు పేతురు ప్రభువును వారించబోతాడు. బాధలను తప్పించుకుపొమ్మనేది సైతాను ఒక్కటే గనుక ప్రభువు పేతురును "సైతానూ" అని సంబోధిస్తూ మందలిస్తారు.

మరి దేవుని ప్రణాళికలో భాగంగా మనం బాధలననుభవించవలసివస్తే అందుకు మనం సిద్ధంగ ఉన్నామా?! లేక మనలో కొందరు చేస్తున్నట్టు కష్టాల పొడ కనబడగానే తాంత్రిక పూజలను మూఢాచారాలనూ ఆశ్రయిస్తున్నామా?! మనది దేవుని మార్గమా? సైతాను వర్గమా?

గ

# సామాన్య 23వ ఆదివారం
# 10-09- 2017

**యెహె 33:7-9** **రోమి 13:8-10** **మత్తయి 18:15-20**

ఒకరి తప్పులొకరు మన్నించుకోవడం, ఒకరు తప్పు చేస్తే నలుగురూ కలసి అతడికి నచ్చజెప్పి మంచి మార్గానికి తేవడం తొలినాళ్ళ నుంచీ శ్రీసభలో కొనసాగుతూ వస్తోన్న సత్సంప్రదాయాలే. గనుకనే ప్రభు క్రీస్తు అనుయాయులందరు తమలోని లోపాలను, పాపాలను గుర్తించి, సాటి విశ్వాసుల సాయంతో వాటిని సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉండాలి. నిరంతరమూ పవిత్రంగా జీవించడానికి కృషి చేయాలి. ఇలా విశ్వాసులు పరస్పరం క్షమించుకోవడానికి, తమ నడవడిని పరస్పరం చక్కదిద్దుకోవడానికి సాక్షాత్తూ క్రీస్తు ప్రభువే మనకు అనుమతి నిచ్చారు, తమ అధికారాన్ని ప్రసాదించారు. పాపులను వెదుక్కుంటూ ఈ లోకానికి విచ్చేసిన ప్రభువే మనకు పాపవిమోచన మార్గం చూపించారు. పవిత్ర మార్గంలో మనలను పరస్పరం సహచరులను చేశారు.

## మొదటి పఠనం: యెహెజ్కే 33:7-9

యెరుషలేము ప్రజలు బాబిలోను ప్రవాసంలో ఉన్న కాలంలోనే దేవుడు యెహెజ్కేలును పిలిచి ప్రవక్తగా నియమించారు. అప్పటికే తాము చేసిన అపరాధములను తెలిసికొని పశ్చాత్తాపపడుతోన్న ఇస్రాయేలీయులను, దేవునికి విశ్వాసపాత్రులుగా మిగిలిన ప్రజలను ఉద్బోధించమనీ, తిరిగి యూదయాకు వెళ్ళేందుకు వారిని సిద్ధపరుచమనీ దేవుడు యెహెజ్కేలును ఆదేశించారు.

ఈనాడు మనం చదువుతోన్న మొదటి పఠనంలో దేవుడు యెహెజ్కేలు ప్రవక్త నిర్వర్తించ వలసిన ప్రధాన ధర్మాలను వెల్లడిస్తున్నారు

**మొదటిది :** ప్రవక్త ఒక కావలివాడు! ఇస్రాయేలీయులకు ఈ ప్రతీక కొత్తదేమీకాదు. నగర ప్రాకారాల మీది బురుజుల లోంచిగాని, ఎత్తయిన పర్వతాల మీద నుండి కొందరు నిరంతరమూ నగరానికి కావలికాస్తూ ఉండేవారు, శత్రువుల సంచారాన్ని ఎప్పటికప్పుడు

గమనిస్తూ ఉండేవారు. శత్రువుల జాడ తెలియగానే సైన్యాన్ని, పాలనా యంత్రాంగాన్నీ, ప్రజలను అప్రమత్తం చేసేవారు. ఈ కావలివారు ఎత్తయిన ప్రదేశాల నుంచి చూస్తూ ఉండటం వల్ల చుట్టుప్రక్కల పరిసరాలను, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సులభంగా గమనించగలిగేవారు.

అలాగే ప్రవక్తలు కూడా నిత్యమూ దేవునికి సన్నిహితులుగా మెలగుతూ ఉండేవారు. గనుక వారు సామాన్య ప్రజలకంటే ఉన్నతస్థాయి నుంచి జనజీవనాన్ని గమనించగలిగేవారు. ఉన్నతస్థాయి దృక్పథంతో విశ్లేషించగలిగేవారు, ఉదాత్తమైన ఉపదేశాలు చేయగలిగేవారు. దేవుని ఆదేశం ప్రకారం ప్రవక్తలు ఇస్రాయేలీయులకు దాపురించబోతోన్న ఆధ్యాత్మిక దుర్గతిని గురించీ, రాజకీయ పతనాన్నీ గురించీ ప్రజలను, ప్రభువులను ముందుగానే హెచ్చరిస్తూ ఉండేవారు. అందుకు ప్రవక్తలను కావలివారితో సరిపోల్చారు. అంతేకాదు ప్రవక్తలు సాక్షాత్తూ దేవుని ఉపదేశాలను ప్రత్యక్షంగా ఆలకించేవారు గనుక, వారు దేవుని దృక్పథాన్ని స్పష్టంగా వెల్లడించగలిగేవారు, అధికారపూర్వకంగా ప్రబోధించగలిగేవారు.

**రెండవది :** ప్రవక్తలు దైవ ప్రతినిధులుగా జీవప్రదాతలుగా మెలగేవారు స్వయంగా దేవుడే వారిని తన ప్రజల వద్దకు పంపి, దారి తప్పిన ప్రజలు తిరిగి తన ఆజ్ఞలను పాటిస్తూ తనతో సఖ్యపడడానికి తోడ్పడమని కోరేవారు. ప్రవక్తల మాటలు విని మనస్సులు మార్చుకొని దేవునితో సఖ్యపడి వారు ఆధ్యాత్మిక పునర్జీవాన్ని పొందగలిగేవారు. ఈ కారణం చేతనే ప్రవక్తలను జీవప్రదాతలైన దైవ ప్రతినిధులుగా పేర్కొనేవారు.

ఈనాటి మొదటి పఠనంలో దేవుడు ప్రవాసంలో ఉన్న ఇస్రాయేలీ ప్రజలకు మాత్రమే జీవదానం చేయుమని చెప్పి యెహెజ్కేలు ప్రవక్తను పంపారు. ఎందుకంటే ప్రవాసానికి ముందే ఇస్రాయేలీ జాతి విచ్ఛిన్నమయింది. ఇక మిగిలింది వ్యక్తులు మాత్రమే. గనుకనే ఇస్రాయేలీ ప్రజలను తన నామమున ఉద్బోధిస్తూ, వారిని సన్మార్గానికి మళ్ళించుమని దేవుడు ప్రత్యేకంగా కోరుతున్నారు. దేవుని ప్రతినిధిగా యెహెజ్కేలు ప్రవక్త ఇస్రాయేలీ ప్రజలను సకాలంలో హెచ్చరించి తిరిగి దేవుని వైపు

మరల్చుకపోయినట్లయితే, తిరిగి తానే శిక్షింపబడతాడని కూడా స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ఇస్రాయేలీయులు ప్రవక్త మాటలు పెడచెవిన పెట్టి మనోపరివర్తనం చెందడానికి, తమ బతుకు బాటలను దిద్దుకోవడానికి నిరాకరిస్తే తమ జీవాన్నే కోల్పోతారని కూడా దేవుడు హెచ్చరిస్తున్నారు.

క్రైస్తవ సంఘంలో విశ్వాసులు ఒకరినొకరు హెచ్చరించుకుంటూ తమ తమ తప్పులను దిద్దుకోవడం గురించి ప్రబోధిస్తోన్న సువార్త పఠనానికి ఈనాటి మొదటి పఠనం ఉపోద్ఘాతంలా ఉపయోగపడుతుంది.

## రెండవ పఠనం: రోమీ 13:8-10

రోమీయులకు రాసిన లేఖ చివరి అధ్యాయాలలో (13-16) పునీత పౌలు క్రైస్తవులు తమ సామాజిక జీవనంలో పాటించవలసిన నైతిక నియమాలు గురించి సోదాహరణంగా వివరిస్తున్నాడు. రోము నగరంలోని క్రైస్తవ సంఘంలో యూద జాతికి చెందిన క్రైస్తవులు అనేకమంది ఉన్నారు. వారందరికీ దేవుని పది ఆజ్ఞలు తెలుసు, ఆ పది ఆజ్ఞల్లో అత్యంత ప్రధానమైన ఆజ్ఞ ఏదో కూడా వారికి తెలుసు. గనుక ఈ లేఖలో పునీత పౌలు పది ఆజ్ఞల సారాంశాన్ని ఒకే ఒక ఆజ్ఞలో పొందుపరుస్తూ "ప్రేమాజ్ఞ" ప్రాధాన్యాన్ని వెల్లడిస్తున్నాడు. పౌలు ఇలా చేయడానికి రెండు కారణాలున్నాయి..

**మొదటిది :** ప్రేమ అనంతమైనది ఇతరులను ప్రేమించేకొద్దీ అది పెరుగుతూనే ఉంటుంది. ఇతరులను మనం ఎంతగా ప్రేమించినా, వారిపట్ల మనం చూపవలసిన ప్రేమ ఇంకా మిగిలే ఉంటుంది.

**రెండవది :** పవిత్రాత్మ ప్రభావంతో నూత్నీకరింపబడిన మనస్సులోంచి ప్రేమ పుడతుంది. గనుకనే ప్రేమ ఎప్పటికీ పరులకు హాని తలపెట్టదు. ప్రేమ ఆత్మ ప్రేరితమైనది గనుకనే మనమెప్పుడూ ప్రేమ చట్టానికి విధేయులముగా మెలగాలి. నిజానికి పది ఆజ్ఞల సారాంశమంతా ప్రేమాజ్ఞలోనే ఇమిడి వుంటుంది. మరో మాటలో చెప్పాలంటే పరిపూర్ణమైన ప్రేమగల వాళ్ళు సహజంగానే పది ఆజ్ఞలన్నింటినీ పాటించ గలుగుతారు, పరిపూర్ణులైన వ్యక్తులవుతారు.

## సువార్త పఠనం: మత్తయి 18:15-20

మత్తయి సువార్త నుంచి మన మీరోజు చదువుకున్న సువిశేష పఠనానికీ (18:15-20), 21వ సామాన్య ఆదివారం నాడు మనం చదువుకున్న సువార్త పఠనానికీ (16:13-20) దగ్గరి సంబంధం ఉంది.

ఈనాటి సువార్త పఠనంలో యేసుప్రభువు "బంధించు" అధికారమును, "విప్పెదు" అధికారమును క్రైస్తవ సంఘానికి ప్రసాదిస్తున్నారు. గతంలో (16:13-20) ఇదే అధికారాన్ని ప్రభువు పేతురుకు అనుగ్రహించారు.

"క్రైస్తవ సంఘం" అనే మాట పైన పేర్కొన్న రెండు సువార్త పఠనాల్లోనూ కనిపిస్తుంది. అయితే ఈనాటి పఠనంలో "క్రైస్తవ సంఘము" అంటే స్థానిక క్రైస్తవ సంఘమని అర్థం. మత్తయి 16:30-20లో కనిపించే "క్రైస్తవ సంఘం" అనే మాట విశ్వజనీన క్రైస్తవ సంఘానికి ప్రపంచ వ్యాప్తమైన శ్రీసభకు వర్తిస్తుంది.

ఈనాటి సువార్త పఠనం క్రైస్తవ సంఘాన్ని అప్రతిష్టపాలు చేసే నైతిక సమస్యలను, పరిహరించే పద్ధతుల గురించి కూడా ప్రస్తావిస్తుంది. పాప కర్మలకు పాల్పడిన వ్యక్తిని సకాలంలో సరిదిద్ది, క్రైస్తవ సంఘాన్ని నైతిక సంక్షోభం నుంచి కాపాడే విధానాలను గురించి వివరిస్తుంది. ఇక్కడ 'పాపము' అంటే స్థానిక శ్రీసభలో అధికారంలో ఉన్న వారికి వ్యతిరేకంగా చేసిన అపదారం మాత్రమే కాదు, క్రైస్తవ సంఘంలోని విశ్వాసులలో ఎవరిపట్ల అన్యాయంగా ప్రవర్తించి అపరాధం చేసినా అది పాపమే అవుతుంది.

అలా అపరాధానికి వొడిగట్టిన వ్యక్తిని సకాలంలో సరిదిద్దుకోడానికి ఈనాటి సువార్తా పఠనం మూడు అంచెల పద్ధతిని ప్రతిపాదిస్తుంది. పూర్వ నిబంధనకాలంలో దైవ ప్రజలు అనుసరించిన "దిద్దుబాటు" విధానమే ఈ పద్ధతికి మాతృక.

ఈ పద్ధతి ప్రకారం తన సాటి సోదరుడు తనకు చేసిన అపకారం వలన నష్టపోయిన వ్యక్తి, ముందుగా అతడిని వ్యక్తిగతంగా కలుసుకొని "అతడి దోషములను నిరూపించి బుద్ధి చెప్పాలి" దీని వలన పాపం చేసిన వ్యక్తికి సంఘంలో ఉన్న పేరుప్రతిష్టలకు భంగం కలుగకుండా కాపాడినవారవుతారు. ఇలా తన సాటి సోదరుణ్ణి సరిదిద్దడానికి పూనుకునే వ్యక్తి పవిత్రాత్మ పూరితుడై ఉంటాడని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆత్మ ప్రేరణతో నడచేవారు తమకు అపకారం చేసిన వారిని సైతం ఔదార్యంతో సరిదిద్దడానికి పూనుకోగలుగుతారు.

రెండవ దశలో తన సోదరుని ప్రవర్తన సరిదిద్దదలచుకున్న వ్యక్తి మరో ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా వెంటబెట్టుకొని వెళ్ళి, మరోసారి అతడిని ఒంటరిగా కలుసుకొని పాపపు మార్గం నుంచి వైదొలగుమని నచ్చజెప్పాలి. ఈ దశలో సాక్షులు ప్రమేయం ఉంటుంది. గనుక ఇది న్యాయసంబంధమైన చర్యగా కనిపిస్తుంది. కానీ దోషిని న్యాయపీఠం ముందు నిలబెట్టడం దీని ఉద్దేశ్యం కాదు; దోషానికి పాల్పడిన వ్యక్తి సామాజిక గౌరవానికి భంగం కలుగకుండా కాపాడుకోవాలనే ప్రయత్నం ఈ దశలోనూ జరుగుతుంది.

ఇక చిట్టచివరి దశలో పాపానికి వొడిగట్టిన వ్యక్తిని సంఘం ముందు నిలబెడతారు. అతడు చేసిన అపరాధములను అందరి ముందు వెల్లడిస్తారు. అప్పుడు సంఘమే అతణ్ణి బహిష్కరిస్తుంది, అతణ్ణి సామాజిక జీవనం నుంచి తొలగిస్తుంది. తద్వారా అతడి పాపపు దుష్ప్రభావం తనను కలుషితం చేయకుండా క్రైస్తవ సంఘం తనను తాను కాపాడుకోగలుగుతుంది. అయితే ఈ మూడవ దశలో కూడ క్రైస్తవ సంఘం దోషిని శిక్షించడానికి ఆతురపడదు. క్రైస్తవ సంఘం తన ఎదుట దోషిగా నిలచిన పాపికి కనువిప్పు కలిగించడానికి అతడిలో నిజమైన పశ్చాత్తాపాన్ని ప్రేరేపించడానికే చివరి క్షణం వరకు ప్రయత్నిస్తుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ మూడు అంచెల "దిద్దుబాటు" విధానంలోని ప్రతిదశలోను పాపి పశ్చాత్తాపానికీ, మనోపరివర్తనకు పునఃసంధానానికే ప్రాధాన్యమీయబడుతుంది తప్ప, పాపిని శిక్షించాలన్న పాశవిక తృష్ణ కనిపించదు.

కనుకనే ఈ "దిద్దుబాటు" ప్రయత్నాలన్నీ ప్రతీ దశలోను ప్రార్థనా పూర్వకంగా జరగాలని యేసుప్రభువు కోరుతున్నారు. అపరాధం చేసిన వ్యక్తిలో మనోపరివర్తనం తేవడానికి ప్రయత్నించే వారందరు ప్రార్థన ద్వారా దేవుని సహాయాన్ని అర్థిస్తూ తమ ప్రయత్నాలు కొనసాగించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా కఠినాత్ముడైన పాపిని బహిష్కరించే మూడవ దశలో క్రైస్తవ సంఘమంతా ముక్తకంఠంతో ప్రార్థన చేయాలని ప్రభువు కోరుతున్నారు.

నిజానికి పాపిలో మనోపరివర్తనం తేగలిగేది మనమనుసరించే మూడంచెల విధానంతోపాటు మనం చేసే వ్యక్తిగత సామూహిక ప్రార్థనలే పాపి మనోపరివర్తనకు మూల కారకాలవుతాయి. ప్రార్థనా ప్రభావంతోనే సంఘంలో సఖ్యతా సామరస్యాలు వర్థిల్లగలుగుతాయి.

చివరిగా ఒక వ్యక్తి పాపాలను క్షమించే అధికారం, బహిష్కరించే అధికారం, తిరిగి పునఃప్రవేశం కల్పించే అధికారం క్రైస్తవ సంఘానికి ఉంటుంది. క్రైస్తవ సంఘంలో సాక్షాత్కరించి ఉన్న యేసుప్రభువే దానికి తన దివ్యాధికారాన్ని ప్రసాదిస్తున్నారు. తన దివ్యసన్నిధానంతో శ్రీసభ అధికారాన్ని ధ్రువీకరిస్తున్నారు.

ఈనాటి సువార్త పఠనం మరో విషయాన్ని కూడా ఇక్కడ సూచన ప్రాయంగా తెలియజేస్తోంది. ముఖ్యంగా మొదటి రెండు దశల గురించి వివరించేటపుడు స్వయంగా యేసుప్రభువే ఈ సత్యాన్ని వెల్లడిస్తున్నారు. అదేమిటంటే పాపాలను మన్నించే అదికారం నిజానికి "మనుజకుమారు" డైన యేసుప్రభువుకు మాత్రమే ఉంది (మత్తయి 9:6) అయినప్పటికీ ప్రభువు తనకున్న దివ్యాధికారాన్ని తాను ఎన్నుకొన్న కొందరు వ్యక్తులతో ఉదారంగా పంచుకోగలిగారు (యోహాను 20:23) ఆ విధంగానే ప్రభువు పాపాలను మన్నించే తన అదికారాన్ని శ్రీసభతోనూ పంచుకున్నారు!.

## ముగింపు:

మనకు అపకారం చేసినవాళ్ళను మన్నించడం, జరిగిన అపరాధాన్ని మరచిపోడం అనుకున్నంత సులభంకాదు. కానీ యేసుప్రభువుకు సజీవసాక్షుల్లా నిలువదలచినవాళ్ళకు అపరాదులను మన్నిచడం, అపరాధాలను మరచిపోవడం చక్కని మార్గం. తన హంతకులను మన్నించుమని ప్రార్థిస్తూ మరణించిన మహానీయుని శిష్యులైన క్రైస్తవులకు శత్రువులను క్షమించడమే సాక్షీభూత జీవన మార్గం.

క్షమ మనుషుల్ని కలుపుతుంది. కక్ష విడదీస్తుంది. మనం క్రీస్తు కోరిన సంఘాన్ని నిర్మించాలంటే అందరినీ క్షమించడం, అందరినీ ప్రేమించడం నేర్చుకోవాలి. కక్షాకార్పణ్యాలకు పాల్పడితే కలసి ఉన్న సంఘం కకావికలవుతుందని తెలుసుకోవాలి. ఇదే సూత్రం క్రైస్తవ కుటుంబానికీ వర్తిస్తుంది, విచారణ స్థాయి క్రైస్తవ సంఘానికీ వర్తిస్తుంది.

మరి మనం ఏం చేద్దాం!
క్షమించే సంధానకర్తలమవుదామా?!
కక్షపూని విధ్వంసకారులమవుదామా?!

# సామాన్య 24వ ఆదివారం
# 17-09- 2017

**సీరా.యేసు.జ్ఞాన 27:30-28:7 రోమీ 14:7-9 మత్తయి 18:21-35**

క్షమ క్రైస్తవ ధర్మం. క్రైస్తవులు ఒకరినొకరు క్షమించుకోవాలనీ, వారి క్షమాధర్మానికి అవధులుండరాదనీ, అనంతంగా వారు అలా తమ సాటి మానవులను క్షమిస్తూనే ఉండాలని యేసుప్రభువు స్పష్టంగా చెప్పారు.

తండ్రి భగవానుడు మానవులపట్ల చూపిన కారుణ్యానికి, క్షమకూ యేసుప్రభు సిలువ మరణమే అపురూపమైన సాక్ష్యంగా, అంతిమ సంకేతంగా నిలచింది.

"సఖ్యతా సంస్కారం" ద్వారా క్రైస్తవులు దేవుని అనంత కారుణ్యాన్నీ, క్షమనూ చవిచూడగలుగుతున్నారు. దేవుని కారుణ్యానికీ, క్షమకూ అంతిమ సంకేతమైన ప్రభు సిలువ మరణ ఘట్టాన్ని నిత్యమూ మనం దివ్యబలి ద్వారా కొనియాడుతున్నాం. ఈ దివ్యబలి విశ్వాసుల ఆత్మలను శుద్ధీకరిస్తుంది, సంపూర్ణంగా పరివర్తనం కావిస్తుంది. వారిలో క్షమాశీలాన్ని పెంపొందిస్తుంది. తండ్రి దేవుడు తమను ఎన్నిమార్లు క్షమించారో క్షమిస్తున్నారో, అన్ని పర్యాయాలు తాము తమ సాటి మానవులను మన్నించగల శక్తిని వారికి ప్రసాదిస్తుంది.

## మొదటి పఠనం: సీరా 27:30-28:7

"సీరా పుత్రుడైన యేసుజ్ఞానగ్రంథాన్ని" యేసు అనే వ్యక్తి రచించాడు. ఇతడు సీరా పుత్రుడైన ఎలియాసరు కుమారుడు. క్రీస్తుపూర్వం 185 ప్రాంతంలో ఇతడు యెరుషలేములో నివసిస్తూ ఉండేవాడు.

ఈ రచయితకు మోషే ధర్మచట్టమన్నా, యెరుషలేము నగరమన్నా, యెరూషలేము దేవాలయమన్నా, యాజక ధర్మమన్నా, నిత్యమూ కొనసాగే దైవార్చనలన్నా ఎనలేని ప్రేమ. తన సమకాలీకులైన యూదుల కోసమే ఇతడు ఈ గ్రంథాన్నీ హీబ్రూ భాషలో రాశాడు. యూదులంతా ఈ గ్రంథాన్ని చదివి, ప్రేరణపొంది, ధర్మచట్టాన్ని మరింత భక్తిశ్రద్ధలతో అధ్యయనం చేసి దానిని నిష్ఠగా పాటించాలన్నది రచయిత అభిలాష. ఈ

గ్రంథ పఠనం ద్వారా సముపార్జించుకున్న దివ్యజ్ఞానంతో వారు దేవుడు తమతో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి జీవించగలుగుతారన్నది అతడి ఆకాంక్ష.

ఈ గ్రంథాన్ని యేసు మనవడు ఒకరు గ్రీకు భాషలోనికి అనువదించాడు. గ్రీకు భాష మాట్లాడే యూదుల కోసం క్రీస్తుపూర్వం 135 ప్రాంతంలో ఈ అనువాదగ్రంథాన్ని అలెజ్జాండ్రియా నగరం నుంచి వెలువరించాడు.

ఈ జ్ఞానగ్రంథం రచనాకాలం నూతన నిబంధన కాలానికీ ఎంతో దూరంలో లేదు. గనుక ఇందులో దేవుడు వెల్లడించిన వేదాంత సత్యాలపట్ల పరిణతి చెందిన అవగాహన కనిపిస్తుంది. దేవునికి విశ్వాసపాత్రులుగా మెలగిన "శేషప్రజ" లకు గల వేదాంత భావాలు ఇందులో చోటుచేసుకున్నాయి. కనుకనే ఈ జ్ఞానగ్రంథాన్ని నూతన నిబంధన వేదాంతానికి అనువైన నేపథ్యంగా భావించవచ్చును.

ఈనాటి మొదటి పఠనంలో జ్ఞానగ్రంథ రచయిత మనం మన సాటి మానవులను మన్నించవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ, అందుకు ప్రేరేపించే అనేక అంశాలను ప్రస్తావిస్తున్నాడు. దేవుడు ఇస్రాయేలీ ప్రజలను ప్రత్యేకంగా ఎన్నుకొని, తనను తాను వారికి వెల్లడించుకొనే క్రమంలో తొలిదశనుంచి  ఆయన వారిని పదేపదే మన్నిస్తూనే వచ్చారు, కరుణిస్తూనే ఉన్నారు. ఇలా దేవుని క్షమ కారుణ్యాలను చవిచూచిన దైవప్రజలు సహజంగానే సాటి మానవులను మన్నించడానికీ కరుణతో ఆదరించడానికీ నిబద్ధులై ఉంటారు.

ఈనాటి సువార్తా పఠనంలో క్షమాధర్మం గురించి యేసుప్రభువు చేసిన ప్రబోధాలకు ఈ మొదటి పఠనం చక్కని ఉపోద్ఘాతంలా నిలుస్తుంది.

## రెండవ పఠనం: రోమీ 14:7-9

క్రైస్తవ సంఘంలో అన్ని రకాల వ్యక్తులూ ఉంటారు. పవిత్ర జీవనం గడిపేవారు కొందరైతే, పాపకర్ములు కొందరు బలవంతులు కొందరైతే, బలహీనులు మరికొందరు. కొందరు మంచివారు మరికొందరు చెడ్డవారు. జీవితులు కొందరు మృతులు మరికొందరు ఇలా పలు రకాల వ్యక్తుల సమూహం క్రైస్తవ సంఘం. ఇలాంటి క్రైస్తవ సంఘంలో మనం ఏకోవకు చెందినవారమైనప్పటికీ అందరమూ ఆ క్రీస్తు ప్రభువుకే

చెందినవారమవుతాము. అవును. ఒకసారి మనం జ్ఞానస్నానం పొంది, క్రీస్తు ప్రభువులో అంతర్భాగాలుగా మారితే చాలు, మన జీవిత సర్వస్వం శ్రీసభ అధీనంలోకి వస్తుంది, మన జీవితంలోని ప్రతి అంశాన్ని శాసించే అధికారం ప్రభువుకు స్వంతమవుతుంది. అంటే జ్ఞానస్నానం పొందిన వ్యక్తి నిత్యమూ క్రీస్తు ప్రభువుకు సన్నిహితుడుగా మెలగుతూ ఉంటాడు. తనతో సన్నిహితంగా మెలగే క్రైస్తవుణ్ణి క్రీస్తుప్రభువు సదా చైతన్య పరుస్తూ నడిపిస్తూ ఉంటారు. గనుక క్రైస్తవ విశ్వాసులందరు ప్రభు చైతన్య పరుస్తూ నడిపిస్తూ ఉంటారు. గనుక క్రైస్తవ విశ్వాసులందరు ప్రభు సాంగత్యానికి, ఆయనతో సన్నిహితంగా మెలగడానికీ అధికప్రాధాన్యమీయాలి. ప్రభువుతో తమకుగల బాంధవ్యాన్ని నిలుపుకోవడంలో ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉండాలి. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఉండాలే తప్ప ఒకరి లోపాలను దోషాలను మరొకరు వేలెత్తి చూపుతూ పరస్పర ఖండనలకు దిగరాదు. మరోమాటలో చెప్పాలంటే ప్రభువుకు చెందిన "ప్రభుజను" లంతా ఒకరిలోపాలను ఒకరు ఓర్పుతో సహిస్తూ ఉండాలి, సౌహార్దంతో మన్నిస్తూ ఉండాలి, ప్రభు సహవాసంలో బలపడడానికీ, స్థిరపడడానికీ పరస్పరం సహాయపడుతూ ఉండాలి.

## సువార్త పఠనం: మత్తయి 18:21-35

క్రీస్తు ప్రభు శిష్యులు తమకు అపకారం చేసి పాపానికి వొడిగట్టిన వారిని ఏ మేరకు క్షమించాలో, వారిని ఏవిధంగా ఆదరించాలో, ఈనాటి సువార్త పఠనం మనకు బోధిస్తుంది.

**మొదటిది:** "ప్రభూ! నా సహోదరుడు నాకు ద్రోహము చేయుచుండ నేనెన్ని పర్యాయములు అతనిని క్షమింపవలెను" (వ.21) అంటూ పేతురు అడిగిన ప్రశ్న వ్యక్తిగతంగా పీడిస్తోన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అడిగిన ప్రశ్న. మానవులు సహజంగానే ప్రతిదానికీ కొన్ని హద్దులుండాలని కోరుకుంటారు, కొన్ని పరిమితులలోనే ఆలోచిస్తారు, స్వార్థపూరితులై ఉంటారు. ఈ తరహా బలహీనమైన మానవ స్వభావం పేతురు అడిగిన ప్రశ్నల్లోనూ వెల్లడవుతుంది.

ఇక్కడ పేతురు అడిగిన ప్రశ్న యూదమత గురువుల ప్రబోధాలను గుర్తుకు

తెస్తుంది. వీరు తమకు ద్రోహము చేసిన వ్యక్తిని మూడుసార్లు మన్నించ వచ్చునని చెబుతారు. ఆమోసు ప్రవక్త చెప్పినట్లు ప్రభువైన దేవుడు ఇస్రాయేలీయులను మూడు పర్యాయాలు మాత్రమే క్షమించి నాల్గవ మారు శిక్షించారు. గనుక ఇస్రాయేలీ ప్రజలు కూడా తమకు అపకారం చేసిన వారిని మూడుసార్లు మన్నిస్తే చాలునన్నది యూదమత గురువుల నమ్మకం.

కానీ పేతురు "ఏడు పర్యాయములా?" అని ప్రభువును అడగడాన్ని బట్టి, తప్పు చేసిన వారిని ఏడుసార్లు క్షమించవచ్చునేమో అనిపిస్తుంది. ఇది పేతురు చూపుతోన్న అదనపు ఔదార్యంగా కనిపిస్తుంది. అయితే ఇది యథార్థమైన ఔదార్యం కాదు. మానవులు వల్లించే న్యాయసూత్రాలు, చేసే ధర్మోపదేశాలూ పైకి ఉదారంగాను సఖ్యతా ప్రయత్నాలుగానే కనిపిస్తాయి. కానీ దేవుడు మానవులపట్ల చూపే అనంతమైన కారుణ్యం ముందు ఇవన్నీ వెలవెల బోతాయి. దేవుని కారుణ్యాన్ని పరిగణలోనికి తీసికొనకపోతే పైకి ఔదార్యంలా కనిపించే మానవుల న్యాయ సూత్రాలన్నీ చివరికి కక్ష సాధనా మార్గాలుగానే నిర్ధారించబడతాయి.

కనుకనే యేసుప్రభువు "ఏడుకాదు, ఏడు డెబ్బది పర్యాయములు" అని అంటూ తన శిష్యులు సాటి వారిని లెక్కలేనన్ని సార్లు, అంటే నిరంతరమూ క్షమిస్తూనే ఉండాలని స్పష్టం చేశారు.

అంతేకాదు తన శిష్యులు ఎందుకు ఏవిధంగా తమ సాటి సోదరులను నింతరమూ క్షమిస్తూ ఉండాలో వివరించడానికి ఆయన ఒక ఉపమానాన్ని కూడా చెప్పారు.

**రెండవది :** యేసుప్రభువుకూ పేతురుకూ మధ్య జరిగిన సంభాషణ నేపథ్యంలో మనకీ ఉపమానం కనిపిస్తుంది.

ఈ ఉపమానంలో ఒకడు రాజుకు "కోట్ల వరహాలు" రుణపడి ఉంటాడు. తెలుగులో "కోట్ల వరహాలు" అని ఉన్నచోట మూలభాషలో "పదివేల తాలెంతులు" అని ఉంటుంది. "తాలెంతులు" అనే మాట మొత్తం నూతన నిబంధన గ్రంథంలో ఈ ఉపమానంలోను, మత్తయి 25:14-30 వచనాల్లోనూ మాత్రమే కనిపిస్తుంది. ఒక "తాలెంతు" అంటే ఒక జీతగాడు 15 యేళ్ళపాటు పనిచేస్తే వచ్చే జీతం కంటే ఎక్కువ.

అలాగే జీతగాడి ఒక్కరోజుకూలి ఒక దినారం. తెలుగులో దీనారానికి బదులు "రూక" అనే మాటను వాడుకున్నాం. దీనినిబట్టి పదివేల తాలెంతుల రుణానికీ, "కొన్ని రూకల" రుణానికీ మధ్యగల వ్యత్యాసం ఎలాంటిదో గమనించాలని కోరుతున్నారు ప్రభువు. ఈ వ్యత్యాసాన్ని ఇప్పటి మన రూపాయిల్లో గణించి చెప్పుకోవాలంటే మొదటివాడు రాజుకు రుణపడి సొమ్ము విలువ 240 కోట్ల రూపాయిలు అతడికి తోటి సేవకుడు బాకీ పడిన సొమ్ము కేవలం ఎనిమిదివేల రూపాయిలు.

కోట్లాది రూపాయిలు ఒక సామాన్యుడు తీర్చగలిగిన రుణం కాదు. అంతపెద్ద మొత్తం అప్పుచేసి తీర్చలేక పోయినందుకు పడే శిక్ష కూడా చిన్నదేమీ కాదు. చట్ట ప్రకారం సుదీర్ఘకాలం కఠినాతి కఠినమైన శిక్షనే అనుభవించ వలసి వచ్చేది. ఆ రుణగ్రస్థుడు పైకి "ఋణము నంతయు చెల్లింతును" అంటాడు గానీ, అందులో నిజం లేదు. అది రాబోయే శిక్షను తప్పించుకోవాలనే ఆదుర్దాతో అన్నమాటే తప్ప, అది అసాధ్యమని అతడికి తెలుసు, రాజుకూ తెలుసు. ఇక్కడే రాజు అనితర సాధ్యమైన ఔదార్యాన్ని ప్రదర్శిస్తూ అతడు అప్పు తీర్చక చేసిన నేరాన్నీ క్షమిస్తాడు, అతడు చేసిన కోట్లాది రూపాయల అప్పును కూడా పూర్తిగా మాఫీ చేస్తాడు. అలా ఆ సేవకుడు ఒకేసారి రెండు పెనుభారాలనుంచి విముక్తుడవుతాడు.

అయితే తాను పొందిన క్షమ ఎంత ఉదాత్తమైనదో, ఎంతటి మహత్తరమైనదో గ్రహించలేని ఆ సేవకుడు, కఠిన హృదయుడై తనకు కొన్ని రూకలు మాత్రమే బాకీపడి తోడి సేవకుణ్ణి నడివీధిలో పట్టుకొని అవమానించి చెరసాలలో వేయిస్తాడు. ఈ సంగతి తెలుసుకున్న రాజు ఆగ్రహోదగ్రుడై మొదటి సేవకుణ్ణి పిలిపించి "బాకీనంతయు చెల్లించువరకు వానిని తలారులకు" అప్పగిస్తాడు (వ. 34) అలా సాటివారిపట్ల జాలి కరుణా లేని సేవకుడికి కఠిన శిక్ష పడడంతో కథ ముగుస్తుంది.

**మూడవది:** ఈ ఉపమానాన్ని ప్రతి క్రైస్తవుడు వ్యక్తిగతంగా తనకే వర్తింపజేసుకోవాలి. తండ్రి దేవుడు తాము చేసిన ఘోరాపరాధాలను నిత్యమూ క్షమిస్తూ, తమకు పడవలసిన కఠోర శిక్షలను మాఫీ చేస్తూ, తమ పట్ల చూపుతోన్న అనంతమైన ఔదార్యాన్ని కారుణ్యాన్నీ క్రైస్తవులంతా గుర్తు చేసుకోవాలి. ఆ ప్రకారమే తామూ సాటి సోదరుల దోషాలను ద్రోహాలను నిరంతరమూ క్షమించగలగాలి, అనంతంగా అలా క్షమిస్తూనే ఉండాలి.

క్రైస్తవులు మాత్రమే తమ తోటి క్రైస్తవులను "హృదయపూర్వకంగా" క్షమించగలుగుతారు. ఎందుకంటే క్రైస్తవుల హృదయాలలో సాక్షాత్తు పవిత్రాత్మ ప్రభువే కొలువుదీరి ఉంటారు. ఆయనే తండ్రి దేవుని కారుణ్యాన్ని క్షమాశీలాన్నీ వారికి గుర్తు చేస్తూ ఉంటారు. అంతేకాదు వారి హృదయాలను తన దివ్యశక్తితో నింపుతూ, తండ్రి దేవునికి సంతానంలా జీవించడానికి, తండ్రివలె తామూ తమ సాటివారిపట్ల అనంతమైన ఔదార్యాన్ని చూపుతూ "హృదయపూర్వకంగా" క్షమించడానికీ తగిన సామర్థ్యాన్ని ప్రసాదిస్తారు. కనుకనే క్రైస్తవులందరు తమ సాటివారిని మనసారా మన్నించడం సాధ్యమవుతుంది.

**ముగింపు:**

నిరపరాధులై ఉండి కూడా కొందరు నిందలు మోస్తూంటారు. ఏ తప్పు చేయకుండానే కొందరు శిక్షలు భరిస్తూంటారు, హింసలననుభవిస్తూంటారు. ఈలాంటి వారి పక్షాన సాక్షాత్తూ దేవుడే నిలబడి న్యాయం చేస్తారు.

కనుక మనం కూడా ఆలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో చిక్కుబడి నిస్సహాయంగా నిందావమానాలను భరించవలసి వచ్చినపుడు "దేవుడు మనకు తోడుగా ఉన్నారని తప్పక మనకు న్యాయం చేస్తారనే నమ్మకంతో నిబ్బరంగా ఉండాలి. దేవుడు మనపై మన శక్తికి మించిన భారాన్ని మోపరని, నమ్మాలి. బాధానివారణకు మన శక్తి మేరకు మనం కృషి చేస్తూ దేవుడు మనకు చేయబోయే న్యాయం కోసం ఆశతో ఎదురుచూస్తూ ఉండాలి.

దేవుని వైపు దృష్టి మరల్చి ఎదురుచూచిన వారెవరూ ఇంతవరకు నిరాశ చెందలేదు, పరాజితులు కాలేదు!

# సామాన్య 25వ ఆదివారం
# 24-09- 2017

**యెషయా 55:6-9 ఫిలిప్పీ 1:20-24,27 మత్తయి 20:1-16**

దేవుని కారుణ్యం సర్వశక్తిమంతమైనది. దేవుని ప్రేమకు పర్యాయపదం దైవకారుణ్యం. ఇది మానవులు చేసే పాపకర్మల కంటే బలమైనది. విశ్వాసహీనులైన మానవులు చేసే ఘోరాలకు నేరాలకంటే శక్తిమంతమైనది. ఒకవిధంగా చూస్తే దైవ న్యాయానికి మరో ముఖం దైవ కారుణ్యం. దివ్యసత్ప్రసాదం ద్వారా మనం ఈ దైవకారుణ్యాన్నే అనుభవానికి తెచ్చుకోగలుగుతున్నాం, యేసు ప్రభువు ద్వారానే మన ఈ అపురూపమైన వరాన్ని పొందగలుగుతున్నాం.

## మొదటి పఠనం: యెషయా 55:6-9

యెరూషలేము నగర రాజ్యం క్రీస్తు పూర్వం 587లో పతనమైనది. బాబిలోనియా సేనలు దండెత్తివచ్చి యెరూషలేమును వశపరచుకొని అనేకమంది ఇస్రాయేలీయులను బందీలుగా బాబిలోనుకు ఈడ్చుకుపోయాయి. ఆ ప్రవాసంలోనే వారు యాభయ్యేళ్ళపాటు బానిసలుగా బతకవలసి వచ్చింది.

అయితే ఈ 50 యేళ్ళ కాలంలో బాబిలోనియా రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. కోరెషు స్థాపించిన పర్షియా సామ్రాజ్యం బాబిలోనియాపై దండెత్తి వచ్చి దానని వశపరచుకుంది. అలా బాబిలోనియాలోని ఇస్రాయేలీయులు కోరెషు పాలనాధికారంలో మనుగడ సాగించవలసి వచ్చింది. బాబిలోనియా పాలకుల ఆలోచనలకంటే పర్షియా చక్రవర్తి కోరెషు ఆలోచనలు భిన్నంగా ఉండేవి. తన సామ్రాజ్యంలో ఉన్న ప్రజల భిన్నత్వాన్ని అతడు గౌరవించేవాడు. భిన్నత్వంలోగల ఏకత్వమే తన సామ్రాజ్యాన్ని శక్తిమంతం చేస్తుందని నమ్ముతూ వచ్చాడు. కనుకనే గతంలో బాబిలోనియాలో బానిసలుగా బతుకులీడ్చుతోన్న వారిని తిరిగి తమ దేశాలకు వెళ్ళమని చెప్పాడు. తమ తమ రాజ్యాలను తమ జాతీయ మతాలను సంస్కృతులను పునరుద్ధరించుకొమ్మని పిలుపునిచ్చాడు. అంతేకాదు వారు తమ తమ దేశాలకు తిరిగి వెళ్ళి తమ తమ రాజ్యాలను పునరుద్ధరించుకోవడానికి, తమ తమ మతాలను సంస్కృతులను పునరుజ్జీవింపజేసుకోవడానికీ అవసరమైన ఆర్థిక వనరులను కూడా సమకూర్చాడు.

ఈ నేపథ్యంలోనే యెషయా ప్రవక్త శిష్యుడు రంగ ప్రవేశం చేశాడు. జరుగుతోన్న పరిణామాలలో దేవుని హస్తాన్ని చూచాడు, దైవ సంకల్పానుసారమే చరిత్ర మలుపు తిరుగుతోందని భావించాడు, ఇది దేవుడు నిర్దేశించిన కాలమని నమ్మాడు. ప్రవాసంలో ఉన్న ఇస్రాయేలీయులందరిని తిరిగి యెరూషలేముకు ప్రయాణం కమ్మని ప్రోత్సహించాడు. దూరాబారానికి జడిసి ఎడారిదారుల్లో సుదీర్ఘ ప్రయాణానికి వెరచి కొందరు యెరుషలేముకు వెళ్ళేందుకు జంకినప్పటికీ ద్వితీయ యెషయా మాత్రం దేవుడిచ్చిన దేశానికి, స్వదేశానికి తరలి రమ్మని ఇస్రాయేలీయులందరిని పలు విధాలుగా ఆహ్వానిస్తూనే ఉన్నాడు.

"ప్రభువు దొరకునప్పుడే అతనిని సమీపింపుడు,
అతడు చేరువలో నున్నపుడే అతనికి ప్రార్ధన చేయుడు" (వ6)

ఈ సందర్భంలోనే ప్రవక్త దైవకారుణ్యాన్ని వేనోళ్ళ కీర్తించాడు. దేవుని కారుణ్యమే పలుమార్గాల ద్వారా పాపకర్ములైన మానవులను శాపాల చెరనుంచి విముక్తులను చేస్తుందని, కనుక దేవుని కారుణ్యానికి పాత్రులు కావడంద్వారా దురాలోచనలను దుర్మార్గాలను విడనాడి ముక్తిని పొందమని పదే పదే ఉద్ఘాటించాడు.

ఈనాటి సువార్త పఠనం కూడా దేవుని కారుణ్యమార్గం, మానవులు అనుసరించే మార్గాలకు మానవులు చేసే ఆలోచనలకు భిన్నమైనదని ఉన్నతమైనదని బోధిస్తుంది. ఆ ప్రబోధానికి ఈ మొదటి పఠనం చక్కని నేపథ్యాన్ని సమకూర్చుతుంది.

"నా ఆలోచనలు మీ ఆలోచనల వంటివికావు
మీ మార్గాలు నా మార్గాల వంటివికావు" (వ8)

## రెండవ పఠనం: ఫిలిప్పీ 1:20-24,27

మాసిదోనియా దేశంలోని ఒక మహానగరం ఫిలిప్పి. అలెగ్జాండర్ చక్రవర్తి తన తండ్రి ఫిలిప్ గౌరవార్ధం ఈ నగరానికి ఫిలిప్పీ అని నామకరణం చేశాడు.

క్రీస్తుశకం 52లో పునీత పౌలు ఫిలిప్పీ నగరాన్ని సందర్శించి సువార్తా ప్రబోధం చేశాడు. ఒకరోజు కలలో తనకు కలిగిన దివ్యదర్శనాన్ని అనుసరించి, దైవాదేశం ప్రకారం పౌలు ఫిలిప్పీ నగరాన్ని సందర్శించి అక్కడి క్రైస్తవ సంఘాన్ని ఉద్బోధించడానికి వచ్చినట్లు తెలుస్తోంది.

పౌలుకు మరణశిక్షపడి చెరసాలలో బందీగా ఉన్నపుడు ఫిలిప్పీ క్రైస్తవులు ఎపఫ్రోదితు ద్వారా ఆయనకు కొంత ధనసహాయం అందజేశాడు.

ఈనాటి పఠనంలో పునీత పౌలు జీవన్మరణాల గురించి ధ్యానపూర్వకంగా తాను తెలుసుకున్న సత్యాలను వెల్లడిస్తున్నాడు. ఒకవేళ తాను మరణించినట్లయితే తాను సాక్షాత్తూ క్రీస్తు సాన్నిధ్య భాగ్యన్నే పొందగలుగుతాడు. కనుక అది తనకు "లాభదాయక" మైనదే అవుతుంది. అయితే ఇలా తానొక్కడే క్రీస్తు సాంగత్యాన్ని సాన్నిహిత్యాన్ని పొందడం పౌలు ఉద్దేశ్యంకాదు. అది ఆయనకు ఆనందాన్ని కలిగించే విషయమూ కాదు. కానీ తాను హతస్సాక్షిగా మరణించినపుడు తన మరణమే ఒక సువార్తా ప్రబోధమవుతుంది, తన కంటే సాక్షీ భూతమైన తన మరణం సర్వోత్తమ ప్రబోధమై సత్ఫలితాలను సాధించగలుగుతుంది. కనుకనే పౌలు తాను హతస్సాక్షిగా మరణించే మహద్భాగ్యం కోసం నిరీక్షిస్తున్నానంటాడు.

అలాకాక తాను మరికొంత కాలం జీవించి ఉండడమే దేవుని సంకల్పమైతే తాను జీవించినన్నాళ్ళూ సత్యసువార్తను బోధిస్తూనే ఉంటానని కూడా చెబుతున్నాడు పౌలు.

అంటే తాను జీవించినా మరణించినా తనకు క్రీస్తు సహవాస భాగ్యం లభిస్తుందని, ప్రభువు తనకు అప్పగించిన అపోస్తోలిక ధర్మం నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంటుందని పౌలు నమ్మకం.

## సువార్త పఠనం: మత్తయి 20:1-16

ఈనాటి సువార్త పఠనంలో మనం యేసు చెప్పిన "ద్రాక్షతోట కూలీలు" ఉపమానాన్ని చదువుతున్నాం. "మొదటివారు కడపటి వారగుదురు, కడపటివారు మొదటి వారగుదురు" అనే సత్యాన్ని మనకీ ఉపమానం బోధిస్తుంది. ఈ సత్యాన్ని లోతుగా అవగాహన చేసుకుంటే ఇస్రాయేలీ దేవుని మనోభావాలేమిటో, ఆయన ప్రవర్తనా విధానమేమిటో కొంతవరకు బోధపడుతుంది.

దేవుడు విశాల హృదయుడు. తన దివ్యకారుణ్యాన్ని కోరివచ్చే వారందరికి ఆయన తన రాజ్యంలో ప్రవేశం కల్పిస్తారు. తండ్రి దేవుని కారుణ్య గుణ మెరిగినవారు కనుకనే యేసుప్రభువు సుంకరులను వ్యభిచారులను, పాపులను దైవరాజ్యంలోనికి ఆహ్వానించారు. ఆవిధంగా దైవరాజ్య స్వభావాన్ని వెల్లడించారు. మొదట యేసుప్రభువులో మూర్తీభవించి ఉన్న ఈ దైవరాజ్యమే పెంతెకోస్తు పర్వదినం నాడు పవిత్రాత్మ ఆగమనంతో "దైవజనసంఘం" గా స్థిరపడింది. దైవరాజ్య వ్యవస్థాపన జరిగింది.

ఈ ఉపమానం ద్వారా యేసుప్రభువు పరిసయ్యులకు, సద్దూకయ్యులకు, యూద

మతాధికారులందరి కనువిప్పు కలుగుజేయదలచుకున్నారు. తాను సుంకరులను వేశ్యలను పాపులను చేరబిలువడానికి కారణమేమిటో, వారికి దైవరాజ్య ప్రవేశాన్ని వాగ్దానం చేయడంలోగల అంతరార్థమేమిటో బోధించడానికే ప్రభువీ ఉపమానం చెప్పారు.

నిజానికి ఈ ఉపమానాన్ని విన్న వెంటనే యూద మతాధికారులు ప్రభువైన యేసు క్రీస్తుకూ, ఆయన "ద్రాక్షతోట" కూ మధ్యగల సంబంధాన్ని అర్థం చేసుకొని ఉండవలసింది. కానీ వారు యేసు మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించడానికి నిరాకరించారు. ఎందుకంటే "దివ్యకారుణ్యం" తో కూడిన "దేవుని న్యాయం" ఎలా ఉంటుందో వారికి బొత్తిగా తెలియదు. కనుకనే ఉపమాన భావాన్ని ఆకళింపు చేసుకోలేకపోయారు. యూదమతాధికారులే కాదు, ఈ "ద్రాక్షతోట కూలీలు" ఉపమానం విన్న సామాన్య ప్రజలుకూడా ప్రభువు చెప్పిన ఉపమానంలోని అంతరార్థాన్ని గ్రహించలేకపోయారు.

క్రీస్తుశకం తొలి శతాబ్దంలో పాలస్తీనా సమాజాన్ని పేదరికం నిరుద్యోగ సమస్యలు పీడిస్తూ ఉండేవి. పేద ప్రజల పరిస్థితి కట్టు బానిసల దుస్థితి కంటే హీనంగా ఉండేది. కట్టు బానిసలకు ఏదో ఒకవేళ కడుపునిండా తిండయినా దొరికేది. కాని పేదప్రజలు మాత్రం చేయడానికి పనులు దొరకక, తినడానికి తిండిలేక, కటకటలాడుతూ బ్రతుకు భారంగా ఈడ్చుకొస్తూ ఉండేవారు.

ఈ నేపథ్యంలో యేసు చెప్పిన "ద్రాక్షతోట కూలీలు" ఉపమానాన్ని విన్న ప్రజలు మొదట ఆనందోత్సాహాలతో పొంగిపోయి ఉంటారు. ఎందుకంటే ద్రాక్షతోట యజమాని ఎంతో ఉదారంగా, కనిపించిన కూలీలందరికీ తన తోటలో పని కల్పించాడు. వారికి రోజువారి కూలిడబ్బులీయబోతున్నాడు. వారి ఇంటిల్లపాదికి ఆ రోజు అన్నం పెట్టబోతున్నాడు.

అయితే ఉపమానంలోని యాజమానుడు కూలి డబ్బులు పంచే ఘట్టం వచ్చినపుడు మాత్రం ప్రజలు చింతాక్రాంతులై ఉంటారు. కూలి డబ్బులు పంచడంలో యజమానుడు ఖచ్చితంగా కొందరికి అన్యాయం చేశాడనే అనుకొని ఉంటారు. ఎందుకంటే **మొదటిది:** యజమానుడు కూలీలందరికీ సమానమైన వేతనమిచ్చాడు, ఉదయమే పనిలోకి వచ్చి రోజంతా ఎర్రటి ఎండలో రెక్కలు ముక్కలు చేసుకున్న వారి శ్రమను ఆయన గుర్తించలేదు, వారికి అధిక వేతనం ముట్టజెప్పే ప్రయత్నం చేయలేదు.

**రెండవది:** మొదట పిలిచిన కూలీలను యజమానుడు ముందుగా కూలి డబ్బులు ఇవ్వలేదు, ఆఖర్న వచ్చిన వాళ్ళకు కూలి డబ్బులిచ్చే వరకు వాళ్ళనలాగే కూర్చోబెట్టాడు. ఇదీ అన్యామనే భావించి ఉంటారు ప్రజలు. ఆనాడు ఈ ఉపమానాన్ని విన్నవారు ధనికులు గానీ పేదలు గానీ రోజంతా పని చేసిన వాళ్ళకు యజమానుడు ఎక్కువ కూలి ముట్టజెప్పడమే న్యాయమని భావించి ఉంటారు. వారేకాదు ఈ ఉపమానాన్ని విన్న ఆధునికులు, మన సమకాలికులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూంటారు. ఉపమానాన్ని ఆవిధంగా ముగించి ఉంటే ఈ ఉపమానం సామాజిక న్యాయానికి వెన్నుదన్నుగా ఉండేదని అంటూ ఉంటారు.

కానీ ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్యాంశమేమిటి అంటే ఈ ఉపమానం న్యాయ సాధన గురించి బోధించే ఉపకరణం కాదు. దేవుని "దివ్యకారుణ్యాన్ని" వెల్లడించడమే ఈ ఉపమాన ప్రధాన లక్ష్యం.

ఉపమానంలో మొదట వచ్చిన కూలీలు ఏవిధంగా చివరి వరకూ ఆగి కడపట వచ్చిన కూలీలపట్ల యజమాని చూపిన కారుణ్యాన్ని ఔదార్యాన్ని కళ్ళారా చూడ గలిగారో, అలాగే ఈ ఉపమానాన్ని విన్న ప్రజలందరు దేవుని "దివ్యకారుణ్యాన్ని" గుర్తించాలని, ఆయన దివ్య స్వభావాన్ని అర్థం చేసుకోవాలని ప్రభువు కోరుతున్నారు. దేవుని "దివ్యన్యాయం" గురించి తెలుసుకున్నంత మాత్రాన మనం దేవుని యదార్థ స్వభావాన్ని అంచనా వేయలేము. దేవుని "దివ్యన్యాయం" గురించి తెలుసుకున్నంత మాత్రాన మనం దేవుని యదార్థ స్వభావాన్ని అంచనా వేయలేము. దేవుని ఔదార్యం, కారుణ్యం ఎప్పుడూ అవధులు లేనివిగానే ఉంటాయి. మనం మనకున్న పరిమితమైన సౌజన్యంతో చేసే చిన్న చిన్న మంచి పనులను చూచి సంతోషించిన దేవుడు తన అనంతమైన ఔదార్యంతో మనకు బహుమానాలను అందజేస్తూ ఉంటారు. మనల్ని ఘనంగా సత్కరిస్తూ ఉంటారు.

అంతేకాదు తమ స్వీయ సౌజన్యం మీద, తమకు తాము నిర్ధేశించుకున్న నైతిక ప్రమాణాల మీద మాత్రమే ఆధారపడి జీవిస్తూ, దేవుని దివ్యకారుణ్యాన్ని ఆశ్రయించని వారికి దేవుడెప్పుడూ తన రాజ్యంలోనికి ప్రవేశం కల్పించరు. తన దివ్యకారుణ్యం మీద ఆధారపడి తన కనుసన్నలలో దీనాత్ములుగా జీవించేవారికే దేవుడు తన రాజ్య ప్రవేశాన్ని కల్పిస్తారు.

అంతేకాదు దైవరాజ్య ద్వారాలు అన్ని వేళల్లోను, అన్ని కాలాలలోను, అన్ని

యగాలలోను తెరచే ఉంటాయి. లోకంలోని మానవులందరికీ దైవరాజ్యంలో ప్రవేశించే అవకాశం ఉంటుంది. అయితే ఇంతకుముందు చెప్పుకున్న యోగ్యతలను బట్టి దైవరాజ్య ప్రవేశ భాగ్యం లభిస్తుంది.

ఒక్కమాటలో చెప్పుకోవాలంటే మానవులు అనుసరించే మార్గాలకంటే దేవుని మార్గాలు ఎంత ఉన్నతమైనవో, మానవుల పాపు స్వభావం ఎంత కరుడు గట్టినదైనప్పటికీ దేవుని అనంత కారుణ్యం దానినెలా కదిలించి కరిగించి క్షాళనం చేయగలుగుతుందో ఈ ద్రాక్షతోట కూలీలు" ఉపమానం ద్వారా ప్రభువు మనకు బోధిస్తున్నారు.

## ముగింపు:

నిరపరాధులై ఉండి కూడా కొందరు నిందలు మోస్తూంటారు. ఏ తప్పూ చేయకుండానే కొందరు శిక్షలు భరిస్తూంటారు, హింసలననుభవిస్తూంటారు. ఈలాంటి వారి పక్షాన సాక్షాత్తూ దేవుడే నిలబడి న్యాయం చేస్తారు.

కనుక మనం కూడా ఆలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో చిక్కుబడి నిస్సహాయంగా నిందావమానాలను భరించవలసి వచ్చినపుడు "దేవుడుమనకు తోడుగా ఉన్నారని, తప్పక మనకు న్యాయం చేస్తారని నమ్మాలి. ఆ నమ్మకంతోనే నిబ్బరంగా ఉండాలి. దేవుడు మనపై మన శక్తికి మించిన భారాన్ని మోపరని, నమ్మాలి. బాధా నివారణకు మన శక్తి మేరకు మనం కృషిచేస్తూ దేవుడు మనకు చేయబోయే న్యాయం కోసం ఇశతో ఎదురు చూస్తూ ఉండాలి.

దేవుని వైపు దృష్టి మరల్చి ఆశతో ఎదురు చూచిన వారెవరూ ఇంతవరకు నిరాశచెందలేదు, పరాజితులు కాలేదు!

# పవిత్ర సిలువ విజయోత్సవం
# 14-09- 2017

**సంఖ్యా 21:4-9 ఫిలిప్పీ 2:6-11 యోహాను 3:13-17**

అపోస్తులుడైన పునీత పౌలు వ్రాసిన లేఖల్లో యేసు మోసిన స్లీవయొక్క శక్తి, మహిమ, ప్రాభవం తెల్పారు. పునీత కాన్స్టెంటైను చక్రవర్తి రోము సామ్రాజ్యాన్ని క్రీ॥శ॥ 312 నుండి 337 వరకు పాలించారు. క్రైస్తవాన్ని అధికార మతంగా ప్రకటించాడు. పరిశుద్ధ పోపుగారికి మద్ధతుగా ఉండేవారు. ఈయన తల్లి పునీత హేలేనా, రోము రాజ భవంతిలొ నివశించింది. పవిత్ర యెరూషలేములోని యూదుల్ని, క్రైస్తవుల్ని ప్రోగుచేసి, క్రీస్తు మోసిన సిలువకోసం వెదకించింది. ఒకచోట మూడు సిలువలు లభించాయి. ఒక మృత శరీరానికి తాకించి అది జీవం పొందగా అసలైన సిలువను గుర్తించారు. ఇది క్రీ॥శ॥ సెప్టెంబరు 14న జరిగిన అద్భుత సంఘటన.

ఆ పవిత్ర స్లీవ పునీత హెలేనా రాజ భవంతిలో ప్రతిష్ఠితంకాగా తదనంతరం అది ఒక దేవాలయంగా మార్చబడింది. పవిత్ర స్లీవ చిన్న చిన్న చెక్కముక్కల్ని ప్రపంచమంతా నెలకొన్న బృహద్దేవాలయాలలొ భద్రపరచారు. క్రైస్తవులు సిలువ ఆరాధనలు అధికంచేశారు. కొన్ని చిన్న ముక్కల్ని చిన్న లోహపు సిలువల్లోను ఉంగారాల్లోను అమర్చి మతాధిపతులు పెద్దలు ధరించారని పునీత క్రిసోస్తంగారు తెల్పారు.

మరో ఐదు సం॥లకు క్రీ॥శ॥ 325లో యోరూషలేములోని కలువరిగిరివద్ద కాన్స్టెంటైన్ చక్రవర్తి ఒక దేవాలయాన్ని కట్టించి పవిత్ర స్లీవలో కొంతభాగం అందు ప్రతిష్టింపచేశారు. అయితే క్రీ॥శ॥ 614లో పర్షియన్ (ఇరాన్) రాజు తన సైన్యంతో దండెత్తి వచ్చి యెరూషలేము దాని చుట్టుప్రక్కల ఉన్న క్రైస్తవ దేవాలయాల్ని అందలి స్వరూపాల్ని వినాశనం గావింపజేశాడు. అడ్డు వచ్చిన క్రైస్తవుల్ని దాదాపు 90వేల మందిని పొట్టనబెట్టుకున్నాడు.

తిరిగి పర్షియాకు వెళ్తూ పవిత్ర సిలువను తన విజయోత్సవ గుర్తుగా పట్టుకుపోయాడు. అయితే మరో 13 ఏండ్లకు క్రీ॥శ॥ 627లో హెరాక్లియుసు అను పొరుగు దేశరాజు దండెత్తి వచ్చి పర్షియాను ఓడించాడు. తన విజయోత్సవంకు చిహ్నంగా

పవిత్ర సిలువను స్వాధీనపర్చుకుని భద్రంగా యెరూషలేముకు పంపించాడు. దీనినే పవిత్ర సిలువ విజయోత్సవంగా నేడు శ్రీసభ కొనియాడుతోంది.

క్రీ॥శ॥ 629లో అదే హోరాక్లియుస్‌రాజు స్వయంగా యెరూషలేముకు వచ్చి ఘనంగా పవిత్ర సిలువ ఆరాధన సల్పాడు. గతంలో అమలులో ఉన్న హెద్రియన్ చట్టాన్ని తొలగించి యెరూషలేములో యూదుల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేశాడు. అందరికీ ప్రవేశం కల్పించి గౌరవపాత్రుడయ్యాడు.

పవిత్ర సిలువ క్రీస్తు శ్రమల్ని, విజయాన్ని సూచిస్తుంది. తన సిలువను తాను మోయడం ప్రతి విశ్వాసి ధ్యేయం. మోషే గడ మీదికి ఎత్తిచూపిన కంచు సర్పంవలె క్రీస్తుకూడ సిలువ మీదికి ఎత్తబడినాడు. ఆ ప్రభుని చూచి నమ్మి మనం రక్షణపొందాలి. క్రైస్తవుని జీవిత సారమంతా “సిలువ” అనే మూడక్షరాల మాటలోనే ఇమిడిఉంది. దేవుని రూపంలో ఉన్న నరుణ్ని పిశాచి ఒక చెట్టు ఎక్కి ఓడించింది. కాగా, దేవుడైన క్రీస్తు మరొక చెట్టు ఎక్కి మరణాన్ని, సాతానుణ్ని జయించాడు. మనకై మోక్షద్వారాం విప్పాడు. వేదం నెరవూర్చబడింది క్రీస్తులో ఇదే జరగక ఉంటే మానవజన్మ వృధా. దేవునికి దూరంగానే మ్రగ్గిపోవాల్సివచ్చేది!

క్రైస్తవుడు ఈ లోకానికి, ఈ లోకము క్రైస్తవునికి సిలువ వేయబడాలి. ఈలోక వ్యామోహాలకు లొంగితే దేవునికి ప్రీతి కలిగించలేము. ఇద్దరు యజమానులకు సేవచేయలేంకదా! సిలువా? సైతానా? ఎవరికి నీ జీవితం, సేవ? దైవచిత్తమైన శ్రమల్ని సంతోషంగా భరించాలి. పునీతులు నేర్పింది ఈ సత్యమే. అందువల్ల రక్షణ సాధనమైన సిలువను ప్రదర్శించడానికి ఈ లోకంలో మనం సిలువ క్రీస్తును అంగీకరిస్తే, సాక్షులుగా నిలిస్తే పరలోకంలో ప్రభువు మనల్ని అంగీకరిస్తారు. తమ దివ్య రాజ్య ఆనందంలోకి స్వాగతిస్తారు. కనుక మన పిల్లలకు సిలువ సాక్షుల పేర్లు పెట్టుకోవడం, భక్తిని ప్రోత్సహించడం శ్రేయస్కరం.

## ధ్యానాంశం:

ఇదిగో! సిలువ మ్రాను! దీనియందే లోక రక్షకుడు వ్రేలాడెను! రండు! అందరము దానిని ఆరాధింతము.

# వ్యాకుల మరియమాత పండుగ
# 15-09- 2017

తపస్సుకాలంలో శుక్రవారాల్లో క్రైస్తవులు ప్రత్యేకించి ఉపవాస ప్రార్థనలు సల్పుతారు. అదే విధంగా మేరీమాత జయంతి సెప్టెంబరు 8న జరుపుకున్న పిమ్మట మొదలుపెట్టి సెప్టెంబరు 15 వరకు మేరీమాత ఏడు వ్యాకులములను ధ్యానించుటను క్రైస్తవులు ఆచరించడం కద్దు. యేసు అనుభవించిన శ్రమలు, మరియమాత అనుభవించిన వ్యాకులముల మధ్య ప్రత్యేక బంధంఉంది. దేవుని తల్లిగా ఆయమ్మ గొప్ప బాధలను భవించాల్ని వచ్చింది. అవి యదార్థంగా బహు దుఃఖ పూరితమైన వ్యథలు. ఆ తల్లి అనుభవించిన ప్రధాన వ్యాకులములు ఇవి.

1. దేవాలయంలో వృద్ధుడైన సిమియోను దీర్ఘదర్శి మరియతో పలికిన ప్రవచనం.
2. బాలయేసును పొత్తిళ్ళలో పట్టుకుని 300 మైళ్ళదూరంలో ఉన్న ఈజిప్టుదేశంకు పారిపోవుట. ఆ దేశంలో పరదేశిగా జీవించాల్సి వచ్చుట.
3. బాలయేసు 12 యేళ్ళ ప్రాయంలో జెరుసలేము తీర్థయాత్రలో తప్పిపోయి 3 దినాలు కనబడకపోవుట.
4. యేసు కలువరికొండకు సిలువ మోసుకునిపోతూ మార్గమధ్యమంలో దేవమాతకు ఎదురుపడుట.
5. యేసు సిలువపై అవమానంగా కొట్టబడుట.
6. యేసు సిలువ క్రింది నిలబడి ఆ తల్లి ప్రభుని దీనావస్థను కండ్లారగాంచుట. ప్రభు హృదయం ఈటెచే పొడవబడుట.
7. యేసు మృత దేహాన్ని తన ఒడిలో పొదవి పట్టుకొని, భూస్థాపితం చేయాల్సివచ్చుట.

ఈ వ్యాకులమాత పండుగను ఆచరించడానికి సెర్విటసు మఠవాసులకు అనుమతి ఇవ్వబడింది. దేశ బహిష్కారశిక్షకు గురైన 7వ భక్తినాధులు పోపుగారు ఆ శిక్షనుండి విమోచనం పొంది క్రీ॥శ॥ 1814లో తిరిగి పేతురు సింహాసనం అధిష్టించిన సందర్భంగా ఈ వ్యాకులమాత పండుగను విశ్వ శ్రీసభ అంతట కొనియాడబడే విధంగా ఆజ్ఞనిచ్చారు.

## ధ్యానాంశం:

"మిమ్ము సృష్టించిన దేవునికి మీరే తల్లి కావున సకల మానవులు మిమ్ము ఆశీర్వదింపబడిన వారనియు, ధన్యురాలనియు పొగడుచున్నారు. పరిశుద్ధ మరియమ్మా! నేను మిమ్ము నమ్మినచో రక్షణనొందెదను". (జెరుసలేము నగర పునీత బిలవేంద్రు)

**ఉపదేశుల బిడ్డలకు చదువు నిమిత్తం సహాయం:**

ఉపదేశుల పరిచర్యను గుర్తిస్తూ, పూజ్యపీఠాధిపతులు **మహా ఘన. శ్రీ తెలగతోటి జోసఫ్ రాజారావు గారు** తన సలహా సభ్యుల సహకారంతో తీసుకున్న నిర్ణయం: సీనియర్ ఉపదేశుల కుటుంబాలలో పి.జి చదివే వారికి ఒక్కరికి, మరియు అదే కుటుంబంలో ఇంటర్ చదివేవారు ఉంటే ఒక్కరికి మైత్రాసన ఎడ్యుకేషనల్ సొసైటి ద్వారా స్కాలర్‌షిప్ అందించడం జరుగుతుంది. జూనియర్ ఉపదేశుల కుటుంబాలలో పిల్లలకు ఒక్కరికి స్పాన్సర్‌షిప్ ఇవ్వడం జరుగుతుంది. ఈ రెండింటికి సంబందించిన అప్లికేషనులు మేత్రాసన ఎడ్యుకేషనల్ సొసైటి నందు లభ్యమవుతున్నాయి. ఉపదేశులు మీ మీ విచారణ గురువుల ఉత్తరంతో, మీ పిల్లలతో కలసి, ఎడ్యుకేషనల్ సొసైటి డైరెక్టరు గారైన **రెవ.ఫా. సింహరాయలు** గారిని సంప్రదించగలరు. **స్కాలర్‌షిప్ ఇచ్చు తేది :** సెప్టెంబరు 25 ఉదయం 9 గంటలకు.

**క్రైస్తవ మౌలిక సంఘాల అవగాహన సదస్సులు:**

### జరపబోయే తేదీలలో చిన్న మార్పులు:

1. సెయింట్ పాల్స్ వికారియేట్ నందు సెప్టెంబరు 11వ తేదీన పాస్టరల్ సెంటర్‌లో జరగవలసిన సదస్సు, మరుసటిరోజు 12వ తేదీన కంకిపాడులో జరగవలసిన సదస్సు, ఈ రెండు సదస్సులు సెప్టెంబరు 18వ తారీఖు, సోమవారమునకు (ఒకేరోజునకు మార్చబడ్డాయి.) ఈ మార్పును దయచేసి గమనించగలరు.

| | |
|---|---|
| స్థలం: పాస్టరల్ సెంటర్ | సెయింట్ పాల్స్ కథెడ్రల్, గుణదల లబ్బీపేట, క్రీస్తురాజుపురం, రాణిగారితోట, కంకిపాడు, వణుకూరు, కానూరు, పెనమలూరు. |
| తేది: సెప్టెంబరు 18, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

2. సెయింట్ పీటర్స్ వికారియేట్‌నందు సెప్టెంబరు 18వ తారీఖున పెజ్జోనిపేటలో జరగవలసిన సదస్సు, మరుసటిరోజు 19వ తారీఖున పాస్టరల్ సెంటర్‌నందు జరగవలసిన సదస్సు, ఈ రెండ సదస్సులు ఒకేరోజు అనగా సెప్టెంబరు 19వ తారీఖున మార్చడం జరిగింది. కావున ఈ మార్పును గమనించగలరు.

| | |
|---|---|
| స్థలం: సెయింట్ పీటర్స్ కథెడ్రల్ | పెజ్జోనిపేట, సత్యనారాయణపురం, ఆర్.ఆర్. పేట, వెల్లటూరు, జక్కంపూడి, సింగ్‌నగర్, నున్న, గొల్లపూడి, జోజినగర్, గుంటుపల్లి, కొండపల్లి, ఇబ్రహీంపట్నం, పైడూరుపాడు. |
| తేది: సెప్టెంబరు 19, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు



| | | | |
|---|---|---|---|
| టి. బాలస్వామి | పోలుకొండ | 01-09-1957 | 9652632382 |
| యమ్. తోమాసు | ఉయ్యూరు | 01-09-1956 | 9391277536 |
| కె. యాకోబు | .......... | 02-09-1972 | 9441799150 |
| బి. జోజిబాబు | గుడ్లవల్లేరు | 02-09-1979 | 9885686653 |
| డి. బాలస్వామి | నెహ్రూపేట | 04-09-1985 | 9866228710 |
| జె. సత్యానందం | నందిగామ | 04-09-1969 | 9441611095 |
| ఇ. వందనం | గన్నవరం | 06-09-1957 | |
| వి. జె.జె. కుమార్ | గన్నవరం | 07-09-1966 | |
| బి. మేరి | నున్న | 09-09-1981 | |
| కె. జయరాజు | ముచ్చింతాల | 09-09-1950 | 9652236519 |
| జి. మత్తయి | బంటుమిల్లి | 10-09-1956 | |
| కె. నందివర్ధనరావు | ముదినేపల్లి | 10-09-1959 | 9505510860 |
| కె. లాజరస్ | పామర్రు | 10-09-1957 | 9553985028 |
| ఎ. యేసురత్నం | జగ్గయ్యపేట | 10-09-1952 | 9866751884 |
| కె. యేసుదాసు | పామర్రు | 10-09-1957 | 9553985028 |
| కె. ప్రేమ్‌కిరణ్ | శారదానగర్ | 14-09-1981 | 9502233298 |
| పి. సద్గుణరావు | మంగినపూడి | 15-09-1956 | |
| యమ్. రాయప్ప (శ్రీను) | వత్సవాయి | 16-09-1977 | 9701057002 |
| కె. జాన్ | భైరవపట్నం | 18-09-1945 | 8184969224 |
| డి. మెల్కియార్ | నందిగామ | 18-09-1979 | 9866372008 |
| బి. జార్జ్ | వెన్ననపూడి | 20-09-1950 | 9440415135 |
| జి. రమేష్ | మునగాలపల్లి | 21-09-1976 | 9912283316 |
| డి. క్రీస్తురాజు | కైకలూరు | 24-09-1971 | 8333871149 |
| ఎ. బంగారుబాబు | చిల్లకల్లు | 26-09-1994 | 9441802213 |
| యమ్. యెషయా | భైరవపట్నం | 29-09-1966 | |
| పి. మరియదాసు | హెచ్. జంక్షన్ | 30-09-1974 | |
| యస్. జాన్నేసు | అవుటపల్లి | 30-09-1954 | |